# 766 శకుంతల

నెంబరు 1 శకుంతల
మనందఱకూ తెలిసిందే—

" అనాఘ్రాతం పుష్పం, కిసలయమలూనం కరరుహై
రనావిద్ధం రత్నం, మధునవ మనాస్వాదితరసం
అఖండం పుణ్యానాం ఫలమివచ తద్రూప మనఘం. "

మఱి నెంబరు 766 శకుంతల ఎట్లావుంటుందీ అన్న విషయమే ఎవరికీ తెలియని విషయము. అదే యీ కథలో చెప్ప బోయే విశేషం. అయితే నెం 2, నెం 3, నెం 4—ఇలా నెం 765 వరకు గల వారినందర్నీ గురించి వ్రాయనక్కరలేదా 766 కు రావడానికి అని సందేహించేరేమో! వారు సర్వసామాన్యంగా అందఱకూ తెలిసినవారే. అంచేత వర్ణించడం మానేసేను. వర్ణించడం మొదలుపెట్టినా పుటలు పెరగడమే కాని విస్ఫుటంగా మన మనస్సుల్లో నిలబడరు వారెవరున్నూ. ఎవరో అటుకుల ధాటివారి శకుంతలమ్మ అనే యిల్లాలొకావిడ వుండేది అని వ్రాసేను అనుకోండి. అంతమాత్రంచేత ' అనాఘ్రాతం ' లా ఘాటుగా గుర్తించడానికి వల్లబడుతుందా? వల్లపడదు. నెం 2 మొదలు నెం 765 వరకు వున్న శకుంతలమ్మల కెవరికిన్నీ స్వయం వ్యక్తిత్వం లేదనేచెప్పొచ్చు. నిజంగా మళ్లీ వ్రేలు మణచి చెప్పొస్తే నెం 766 శకుంతలే శకుంతల.

ఇతరులు ఆమెయొక్క సూదిమొనలా నిగ్గూ వాడిదేఱి వున్నటువంటి నాసికాగ్రాన్ని ఉపలక్షిస్తూ వుంటే ఆమె తన

తొంగలి ఱెప్పల్తోను. ఇతరులు ఆమెయొక్క విశాలమైన నున్నని తేటైన నెన్నుదురు పరీక్షిస్తూ వుంటే ఆమె తన వుంగరాల ముంగురుల్తోను చాటేసి మాటేసి ప్రేమభావం వెల్లడించే విదుషీ మణి. పైకేమాత్రం తేలే మనిషికాదు. ఆలాగ్గానే కూర్చుంది రైలు బండిలో. ఆలాంటి అందమైన వాళ్లెప్పుడున్నా మెయిలు బండే ఎక్కుతారని వేరే వ్రాయనక్కరలేదు. ఆ రయిలు బండి మెయిలుబండి. ఆమె ఎక్కి కూర్చున్న పెట్టె పెద్ద పెట్టె. పెద్ద పెట్టె అంటే తెలియదూ పాఠకులకు? ఇటూ అటూ పచారు చెయ్యొచ్చు అందులో—ఖాళీ వొక్క మినహాయింపు. పెట్టె ఖాళీగా వుండాలి! మఱి మెయిలు ట్రెయిన్‌లో పెట్టె ఖాళీగా వుండడం అంటే కలికాలంలో నరకలోకం ఖాళీగా వుండడం ఎట్లాంటి అసంభవమో అట్లాంటి అసంభవ పరిస్థితి.

ఆమె పాపం అక్కడికీ ఆడవాళ్ళ పెట్టెలోనే ఎక్కి కూర్చుంది. అయితే ఇరుకు అన్నిపెట్టెలూ సర్వసామాన్య ములే. అందులోనూ ఆడవాళ్లు పృధు జఘనులు—పృధు—పృధు— చోటు ఆబరించు కూర్చోవడంలో వాళ్లు ఫస్టు. ఈమె కూడా తక్కిన వాళ్ళ కేమాత్రం తీసిపోకుండా కూర్చుంది.

రైలు రాజమండ్రి పెద్ద స్టేషనులో ఆగి ఇంజిన్ మార్చు కుంటూవుంటే, గాలికోసమన్నట్టు ఈమె—మనావిడ—(కథలో పాత్రనైనా మనావిడ అని వ్రాయడం సాంఘికపు రూల్సుకు వ్యతిరేక మనుకుంటాను) కథలోని ఆవిడ లేక ఈ కథానాయకు రాలు ప్లాట్‌ఫారమ్ మీదకు దిగి ఇటూ అటూ చూచి 'మాబండీ ఇంజెన్కు క్లోజుగానే వుంది. అంచేతనే ఇంత కోల్డస్టు నా జుత్తు మీద పడింది' అంటూ గోళ్లతో సరిచేసుకుని బండికి తగులు

కుంటూవున్న కొ_త్త ఇంజన్‌యొక్క_ అందం, చందం, పేరు గీరు, విర్ విసిల్ అన్నీ విలాసంగా చూస్తూ మధ్యమధ్య ఎవరి కోసమో అన్నట్లు తిలకిస్తూ వుంది.

ఆమె మైండ్ మాడరన్ ఫాషన్ ఫాక్టరీలో మోల్డు అయి ఎమెండ్ అయిన మైండ్ అని పాఠకులప్పుడే గ్రహించి వుంటారు ఆమెవద్ద కోయురేషియన్ టిక్క_ట్టు కలక్టరు వస్తూ 'టిక్క_ట్ మాడమ్' అన్నాడు. 'టిక్క_ట్ మావాళ్లవద్ద వున్నది' అంది. 'మావాళ్లు. హు?' అన్నాడు అతడు. అంటూ 'బండిలోని ఆసామానంతా?' అవి అడిగాడు. 'అదంతా బెడ్డింగు' అంది. 'ఇట్ మస్టుబి వెయిడ్' అన్నాడు. 'నన్నూ వెయ్యాల' అంది. 'యుస్పీక్ ఇన్ ఇంగ్లీష్' అంటూ వెళ్ళి పోయి టిక్క_ట్టు కలక్టర్ గార్డుతో ఏమేమో చెప్పి ప్లాటుఫారమ్ మీదనుండి నిష్క్రమించేడు. బండీకూడా .కదలిపోయింది.

నిడదవోలు స్టేషన్‌వద్ద బండి ఆగినప్పుడు గార్డు ఆడ వాళ్ళ బండివద్దకు వచ్చి ఆమె కూర్చున్న దగ్గఱ కిటికీలోంచి తొంగిచూస్తూ 'మాడెమ్! మావాళ్లు ఎక్క_డ?' అన్నాడు. 'నాకు తెలీదు' అంది. గార్డు వెళ్ళి స్టేషన్ మాష్టరుతో చెప్పాడు ఏమిటో. స్టేషన్ మాష్టర్ వచ్చి 'అమ్మా! మీవాళ్లు అనడానికి మావాళ్లు అన్నాడు గార్డుదొరగారు. మీవాళ్లు ఎక్క_డ?' అన్నాడు. 'మావాళ్లు అనకాపల్లిలో వున్నారు' అంది. 'మావాళ్ల వద్ద టిక్క_ట్టు అంటే అనకాపల్లిలోవున్న మీవాళ్ళ వద్దనా? ఈః పప్పుడకదు.' అని కిటికీగుండా లోనికి తొంగిచూచి 'మీవద్ద సామాను చాలా వున్నట్టు వున్నదే? చూడండి ఇక్క_డ టైమ్ చాలదు. తాడేపల్లిగూడెంలోనా అక్టేసేపు నిలవదు.

మీ పేరు ? ' అన్నాడు. ' నా పేరు శకుంతల ' అంది ధైర్యంగా. ' సరేను. థాంక్సు ' అని వెళ్ళిపోయినాడు స్టేషన్‌మాస్టరు. రైలుకు ఈల ఇచ్చాడు గార్డు. గారు ఈలకు ప్రతిగా ఇంజెన్ కూసింది. రెండుకూతలకు మేళవింపుగా స్టేషన్‌లో గంట మోగింది. మూడూ ఏకకాలమందే జరిగినాయి అన్నా రైటో ! రైటో ! మెయిల్ నడుస్తూంది.

మెయిల్ ప్రక్క పొలాలమీదుగా తీగెలగుండా మెయిల్లో వాళ్ళకు తెలీకుండా తంతివార్త వెళ్ళిపోతూవుంది మెయిలుకంటె ముందు ఏలూరుకు " Stop Sakuntala at Ellore ! " ఏలూరులో శకుంతలను ఆపివేయవలసింది అని. మెయిలుబండిలో ప్రయాణం చేస్తూవున్న శకుంతలకు ఏం తెలుసును ఆ సంగతి ? ఆమె నిశ్చింతగా నిగనిగలాడే కవరు వున్న నవల వొకటి చదువుకుంటూ వుంది కళ్లద్దాలంట కుటిలాలకాల్లోకి చిటార్ చూపులు చూచుకుంటూ.

ఏలూరు స్టేషన్ వచ్చింది. రైలు నిల్చింది. మన కథా నాయకి కూర్చున్నపెట్టెని చుట్టేశారు క్రమ క్రమంగా చాలా మంది. ఒకరేమిటి ? మొదట గార్డు. తరువాత స్టేషన్‌మాస్టర్. వారిద్దరూ ' దిగండమ్మామీరు, దిగాలమ్మామీరు ' అని ఒకడు ఇంగ్లీషులో ఒకడు అరవంలో అనడం ' గెడ్డవున్ ' ' ఎరింగో ' ధ్వనులు మిన్నుముట్టడం వింటూ తెనుగు ప్రయాణీకులు ఒక్కొక్కరే చుట్టేసుకున్నారు వారిద్దర్నీ ! ఆ చుట్టేసుకున్న ఆ ప్రయాణీకుల్ని చూడాలి ఆ నిమేషం. రియల్ ప్రోబ్లెమ్ అర్థంకాక నిక్కర్ తొడిగినవాని రెండు తొడల జేబుల్లోని రెండు చేతులూ అలాగే వుండిపోయినాయి వొక ప్రయాణీకునకు, మరో

ప్రయాణీకునకు గూడకట్టు స్టెప్‌బై స్టెప్ సింప్లిఫై అయిపోతూ తనంతటదే ఆ నిర్ఘాంతపు చూపుల్లో నిక్కర్ అయిపోతూవుంది!

తుదకు ఇంజన్ విడిచిపెట్టి డ్రైవర్, కోల్మన్. ల్యూబ్రికేటింగ్ ఆయిల్ పోసేవాడు ముగ్గురూ త్రిమూర్తుల్లా దిగవలసి వచ్చిందికూడాను.

కథానాయికి అంటుంది వాళ్లతో 'మీలో ఎవ్వరికైనా ఇంగ్లీషు వచ్చునా? ఇంగ్లీషు అక్షరాలు కూడాబలుక్కు చదవడం వచ్చునా? మొహాన్ని వ్రాసుకొని నేను తగుదునమ్మా శకుంతలమ్మను అని తిరుగుతూవున్నదాన్ని విడిచిపెట్టి దీన్ని పట్టుకు దించబోవడం మీమీ మౌఢ్యాన్ని సూచిస్తూవుంది. మీ అజ్ఞానాంధకారాన్ని వెలిబుచ్చుతూంది.' అని ఏమేమో ఘట్టిగా లెక్చరు దంచేసింది. ఆమె రైలుబండీ తలుపుప్రక్క కడ్డీ మీదకు ఓచేయిఆంచి, రెండోచేత మూసినపుస్తకం, పుటలమధ్య వేలెట్టి, పూచుతూ.

స్టేషన్ మేష్టర్ వెంటనే గార్డుతో 'వాంగోఅప్పా! మరో శకుంతల వుందేమో ఎక్కణ్ణయినా పారుంగో అప్పా!' అన్నాడు. అలా అంటూనే గార్డూ స్టేషన్ మాస్టరూ అన్ని బండ్లల్లోవున్న ఆడవాళ్ళపేర్లు కనుక్కోసాగారు, మధ్యమధ్య ఈమెతో 'ఎవరమ్మా? మరెవర్నీ కాణమే?' అంటూ.

కొంతసేపటికి తన చడావులు చప్పుడయ్యేటట్టు బండీ పురికి అమ్మత్తకాసిని 'గుడ్డివాళ్లు మీరందరు. మడ్డల్లు హేడ్ గాళ్లు! కనబడ్డంలే 766 శకుంతల. బోల్డ్ లెటర్సులో ఎంజీన్ మీద. Stop it if you have pcwer not me. మీకు శక్తివుంటే దాన్ని ఆపుకోండి. నన్నుకాదు' అని చూపుడువ్రేలితో చూపించి

తర్జనితో జడిపించి తన బండిలోకి తిరిగి ఎగిరి ఎక్కి కూర్చుంది నవ్వుతూ !

స్టేషన్ మాష్టరు " It might be. కావచ్చు. She is an educated lady. You see ఆమె విదుషీమణి ! Don't meddle with her. ఆమె జోలికి మనము పోరాదు." అని గార్డుతో అన్నాడు. ఇంజెన్ డ్రైవర్ ఆ మాటలు వింటూ గార్డును లాగి " You can never stop my engine whatever its name be! నా ఇంజెన్ పేరేమైనాసరే దాన్ని ఆపడానికి వల్లకాదు " అని బిర్రుగా ఇంజన్ ప్రక్క నిలబడ్డాడు. 766 నెంబరు శకుంతల మెయిల్ ఇంజన్ వాని ప్రక్కన ఒకటవ నెంబరు శకుంతల్లా మెఱసిపోయింది !

అనాఘ్రాతం—వాసన చూడడానికి వీలులేని పొగ, అలూనం కరరుహైః—గోళ్ళకు స్వాధీనం కాని ఇనుము, అనావిద్ధం—రంధ్రం చెయ్యడానికి రాని రాకసిబొగ్గు, అనాస్వాదిత రసం—తాగడానికి అసహ్యమైన వేన్నీళ్లు, ఫలమివచ తద్రూపమనఘం—భుజించడానికి వలనుకాని మహాపతివ్రతాగ్నిహోత్రకాదు ! మహాపవిత్రాగ్ని హోత్రం అఖండం ? పరిపక్వమైన అగ్ని హోత్రం !